వంశధారకు


వంశధార రిజర్వాయర్

అడ్డు తొలగేనా?

- ఆంధ్రా, ఒడిశాల్లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వాలు
- ఇరు రాష్ట్రాల జల వివాదం పరిష్కారంపై ఆశలు
- నేరడి బ్యారేజీ కల సాకారమయ్యేనా!

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువు దీరడంతో సిక్కోలు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇరు రాష్ట్రాల మధ్య ఐదు దశాబ్దాలుగా నెలకొన్న వంశధార జల వివాదం పరిష్కారమయ్యే అవకాశం ఉందని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వంశధార జల వివాదంతో పాటు.. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకి తొలగించేందుకు కేంద్రం చొరవ చూపాలని కోరుతున్నారు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

(హిరమండలం)

ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల మధ్య వంశధార జల వివాదం ఐదు దశాబ్దాలుగా కొనసాగుతోంది. వంశధారలో సీడబ్ల్యూసీ ఒప్పందం ప్రకారం 105టీఎంసీల నీరు ప్రవహిస్తోంది. ఇందులో ఉభయ రాష్ట్రాలు చెరోసగం వినియోగించుకునేలా అప్పట్లో అంగీకారం కుదిరింది. వంశధారకు వచ్చిన వరద నీరంతా సముద్రంలో కలుస్తోంది. 1960 నాటికి 70 టీఎంసీల నీరు నదిలో ప్రవహించేది. 1961లో అప్పటి ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య శంకుస్థాపనచేసి.. 1962లో నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆ సమయంలో ఒడిశా ప్రభుత్వం మొకాలడ్డింది. దీంతో వంశధార ఫేజ్-2, స్టేజ్-2గా విభజించి గొట్టాబ్యారేజీ నిర్మాణం చేపట్టారు. అయినా వంశధార నదీ జలాలు పూర్తిస్థాయిలో వినియోగించాలంటే నేరడి బ్యారేజీ తప్పనిసరి. ఈ నేపథ్యంలో పలుసార్లు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరినా.. రాజకీయ కారణాలతో బెడిసికొట్టింది. దీంతో ఒడిశాతో సంబంధం లేకుండా కాట్రగడ నుంచి సైడ్‌వీయర్ కెనాల్ ద్వారా వంశధార వరదనీటిని హిరమండలం రిజర్వాయర్‌కు మళ్లించేందుకు రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు సీఆర్ఎస్ పట్నాయక్ డిజైన్ రూపొందించారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.999 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే ఒడిశాలోని గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ పరిధిలో తాగునీటి సమస్యతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పొలాలకు నీరు అందదని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ కమిటీ ఏర్పడింది. ముకుంద శర్మ చైర్మన్‌గా నియామకమైన తరువాత విచారణ వడివడిగా సాగింది. 2013 ఏప్రిల్ 19న కమిటీ చైర్మన్ శర్మతోపాటు కమిటీ సభ్యులు, ఉభయ రాష్ట్రాలకు చెందిన సీనియర్ ఇంజనీర్లు పరిశీలించారు. గొట్టాబ్యారేజీకి ఎగువనున్న గ్రామాలతో పాటు కాట్రగడ, నేరడి బ్యారేజీ నిర్మాణం అవతలి వైపు ఉన్న నదీ పరివాహక గ్రామాలను సందర్శించారు. 1980 తర్వాత వచ్చిన వరద లెక్కలను కూడా ఇరుప్రాంత ఇంజనీర్లు నుంచి సేకరించారు. ఈ నేపథ్యంలో సైడ్‌వీయర్ కెనాల్ నిర్మించి 8టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు ఆంధ్రా ప్రభుత్వానికి అనుకూలంగా ట్రిబ్యునల్ కమిటీ తీర్పునిచ్చింది. అయితే నేరడి బ్యారేజీ నిర్మాణం జరగనిదే హిరమండలం, పారాపురం, సింగిడి బ్యారేజీ, గొట్టాబ్యారేజీ ద్వారా జిల్లాకు పూర్తిస్థాయిలో నీరందదని కమిటీ ముందుంచారు. నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం సరా, బడిగాం గ్రామాలకు చెందిన 106 ఎకరాల భూమిని సేకరించేందుకు ఒడిశా ప్రభుత్వం అనుమతించాల్సి ఉంది. ఈ భూభాగాన్ని అప్పగిస్తే ఒడిశా వైపు రక్షణ గోడలతో పాటు సాగునీటి కోసం కాలువను నిర్మించి అప్పగించేందుకు ఆంధ్రా ప్రభుత్వం అంగీకరించింది. బ్యారేజీ నిర్మాణం వలన ఒడిశాకు ఎలాంటి నష్టం ఉండదని.. చిన్నపాటి నష్టం ఎదురైనా తగు జాగ్రత్తలు తీసుకుంటామని వంశధార అధికారులు చెప్పా రు. సరా, బడిగాం వైపు వరద ముంపు లేకుండా 3.8కిలోమీటర్లు కరకట్టల నిర్మాణం చేపడతామని, డ్రైన్‌లు నిర్మిస్తామని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. 1960లో రూపొందించిన డిజైన్ కాకుండా.. ఆధునాతన పద్ధతిలో నేరడి బ్యారేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని అప్పట్లో నిర్ణయించారు. అదనంగా సాగునీరు వినియోగించడంతో పాటు భవిష్యత్‌లో నీటి సమస్య కూడా ఉత్పన్నమవ్వకుండా ప్రణాళిక రూపొందించారు.


వంశధార నదిపై నేరడి వద్ద బ్యారేజీ నిర్మించాల్సిన ప్రాంతం

● సైడ్‌వీయర్ కెనాల్ నిర్మాణం..

కాట్రగడ గ్రామం నుంచి సైడ్‌వీయర్ కెనాల్ ద్వారా వంశధార నదిలో 8టీఎంసీల నీటిని మళ్లించుకునేందుకు ఆంధ్రాకు అనుకూలంగా 2013 డిసెంబర్ 17న ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. 6 టీఎంసీ నిల్వ సామర్థ్యం కలిగిన నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి ట్రిబ్యునల్ ఆంధ్రాకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా.. ఒడిశా ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. జలవివాదం పరిష్కారానికి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ కమిటీ సభ్యులు.. పలుమార్లు వంశధార నది ఆంధ్రా, ఒడిశా భూభాగాల్లో పర్యటించారు. చైర్మన్ ముకుందశర్మ, జస్టిస్ బి.ఎస్.చతుర్వేది ఆధ్వర్యంలో నేరడి బ్యారేజీ నిర్మాణం తలపెట్టిన నదీ పరివాహక ప్రాంతాన్ని, హిరమండలం వద్ద నిర్మాణంలో ఉన్న వంశధార రిజర్వాయర్‌ను, ఒడిశాలో సైడ్‌వీయర్ కెనాల్ నిర్మించదలచిన ప్రాంతాన్ని టిబ్యునల్ సభ్యులు పరిశీలించారు.

● ట్రిబ్యునల్ పరిశీలనలో..

2013 మార్చి 1న ట్రిబ్యునల్ చైర్మన్ ముకుంద శర్మ ఆధ్వర్యంలో బి.ఎస్.చతుర్వేది, గులాం మహ్మద్ బృందం ఆంధ్రా-ఒడిశా వంశధార నదీతీర ప్రాంతాలను పరిశీలించింది. ఆ సమయంలో అప్పటి డిజైన్ ప్రకారం 2.60 లక్షల క్యూసెక్కులు కాకుండా 6లక్షల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని ఒడిశా ప్రభుత్వం ట్రిబ్యునల్ సభ్యులను కోరింది. అందుకు కూడా ఆంధ్రా ప్రభుత్వం అంగీకరించింది. 500 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే 6 లక్షల వరకు క్యూసెక్కుల వరద నీరు వస్తుందని ఆంధ్రా ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అలాగే ప్రాజెక్టుకు కింద, మీద ప్రాంతాల్లో 680మీటర్ల మేర గైడ్‌బండ్ నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ప్రాజెక్టు వలన ఒడిశాకు ఉపయోగపడేలా 370క్యూసెక్కుల సామర్థ్యంతో నేరడి బ్యారేజీ నుంచి కాలువ తవ్వి ఇచ్చేందుకు ఆంధ్రా అధికారులు అంగీకరించారు. ఈ కాలువ ద్వారా ఒడిశా రాష్ట్రంలో 10వేల ఎకరాలు సాగవుతుందన్నారు. బ్యారేజీకి ఎగువ ప్రాంతంలో 6కి.మీల ముంపునకు గురవుతుందని ఒడిశా అభ్యంతరాలు తెలపగా, దానికి ఇరువైపులా రక్షణ గోడలు కూడా నిర్మిస్తామన్నారు.

టీడీపీ హయాంలో పనులు వేగవంతం..

హిరమండలం వద్ద 19 టీఎంసీ నిల్వ సామర్థ్యంతో సుమారు 10వేల ఎకరాల్లో వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు టీడీపీ హయాంలో వేగవంతమయ్యాయి. జలయజ్ఞంలో భాగంగా కాంగ్రెస్ హయాంలో రూ. వెయ్యి కోట్ల అంచనాతో పనులు ప్రారంభించినా.. నత్తనడకన సాగాయి. ప్రధానంగా భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులో జాప్యంతో రిజర్వాయర్ పనులపై సందేహాలు నెలకొన్నాయి. తర్వాత టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు.. ప్రాధాన్యత ప్రాజెక్టులో వంశధార రిజర్వాయర్‌ను చేర్చారు. నిర్వా సితులకు నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించి గ్రామాలు యుద్ధ ప్రాతిపదికన ఖాళీ చేయించారు. పనులు వేగవంతం చేశారు. 8 టీఎంసీల నీరు నిల్వ ఉంచేలా సుమారు 80శాతం పనులు పూర్తి చేయించారు. 2018 ఆగస్టు 15న కాట్రగడ నుంచి సైడ్‌వీయర్ కెనాల్ ద్వారా వంశధారకు వచ్చిన వరదనీటిని పంపి జిల్లా రైతుల కలలు కొంతవరకు సాకారం చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులు నిలిచిపోయాయి.

బ్యారేజీ కడితే ఒడిశా అభ్యంతరాలు..

గొట్టాబ్యారేజీ నిర్మాణంతో కాశీనగర్ వరకు ముప్పు వాటిల్లిందని, 1980లో వచ్చిన వరదలకు నష్టపోయామని ఒడిశా ఇంజనీర్లు 2013 ఏప్రిల్ 4న ట్రిబ్యునల్ కమిటీ ముందుంచారు. గొట్టాబ్యారేజీకి ఇరువైపులా ఆంధ్రా ప్రాంతమే అధికంగా ఉందని, దానివల్ల ముప్పు వాటిల్లే పరిస్థితి లేదని ఆంధ్రా ఇంజనీర్లు ఎదురించారు. దీంతో గొట్టాబ్యారేజీ నిర్మాణానికి ముందు గత ఐదేళ్ల వరద వివరాలను అందజేయాలని ట్రిబ్యునల్ కమిటీ చైర్మన్ ముకుందశర్మ ఆంధ్రా అధికారులకు సూచించారు. అలాగే నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం జరిగితే గుణుపూర్‌కు నష్టం వాటిల్లుతుందని అక్కడి ఇంజనీరింగ్ అధికారులు చెప్పగా, దానిని పూర్తిస్థాయిలో విశ్వసించే పరిస్థితి కనిపించలేదు. నది భౌగోళికంగా వరదలు వచ్చేటప్పుడు మారుతుంటుందని అంతమాత్రాన ప్రమాదం అనుకుంటే పొరపాటని, నిబంధనల మేరకే బ్యారేజీ నిర్మాణం చేపట్టాలంటూ ఆంధ్రా ఇంజనీర్లు ముకుందశర్మ దృష్టికి తీసుకువెళ్లారు. ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ వాటర్ కమిషన్ ఇంజనీర్లు కూడా ఆంధ్రా ఇంజనీర్ల అభిప్రాయానికి ఏకభవించారు. బ్యారేజీ నిర్మిస్తే సుమారు 3కిలోమీటర్ల వరకు ఇసుక మేటలు వేసే అవకాశం ఉందని తెలిపారు. గొట్టాబ్యారేజీ నిర్మించి సుమారు 40 ఏళ్లు దాటినప్పటికీ.. ఇప్పుడు ఇసుక మేటలు వేశాయంటే అర్థరహితమన్నారు. ఈక్రమంలో వాదనలు తెలియజేసిన ఒడిశా రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులకు ముకుందశర్మ కొన్ని ప్రశ్నలు వేయగా.. వాళ్లు నీళ్లు నమిలారు. కొన్ని చిత్రపటాలు కూడా మార్చి చూపించారు. దీనికి ట్రిబ్యునల్ బందం అంగీకరించలేదు. కావాలనే దీనిని రాజకీయం చేస్తున్నట్లు బృందం సభ్యులు గ్రహించారు. ఆంధ్రాలో కాట్రగడ వద్ద సైడ్‌వీయర్ కెనాల్ తవ్వి నీరు మళ్లిస్తే 8వేల క్యూసెక్కులు మాత్రమే వెళ్తుందని, కానీ కిందకు 2లక్షల క్యూసెక్కులకుపైగా నీరు సముద్రంలో కలుస్తుందని తెలిపారు. దీనికి మీకెందుకు అన్యాయం జరుగుతుందని ఒడిశా అధికారులను ప్రశ్నించారు.


ఆంధ్రా, ఒడిశా అధికారుల వద్ద అభ్యంతరాలు తెలుసుకుంటున్న ట్రిబ్యునల్ బృందం (ఫైల్)

● ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడినా..

2022 డిసెంబర్‌లో ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్‌రెడ్డి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో అక్కడ అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సంప్రదించారు. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2, స్టేజ్-2 పనులకు సంబంధించి అంతర్రాష్ట్ర జలవివాదంపై మాట్లాడారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి తీర్పు ఇచ్చినా.. లీగల్‌గా ఒడిశా ప్రభుత్వం ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పట్లో పరిష్కారం జరిగే సూచనలు కనిపించక పోవడంతో హిరమండలం వద్ద రిజర్వాయర్ నింపేందుకు కొత్తగా మరో ప్రతిపాదన తీసుకువచ్చారు. ప్రత్యామ్నాయంగా గొట్టాబ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రిజర్వాయర్‌లోకి నీరు పంపిస్తే వస్తున్న వేసవికే రబీ పంటలకు నీరు అందివ్వచ్చని వంశధార ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. ఆ దిశగా వైసీపీ ప్రభుత్వం చర్యలు మొదలెట్టింది. కాగా.. ఒడిశాతో జలవివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ప్రస్తుతం ఒడిశాలో బీజేపీ, ఆంధ్రాలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు కొలువుదీరాయి. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా ఉన్న వంశధార జల వివాదాన్ని పరిష్కరించి.. సాగునీటి ఇబ్బందులు తొలగిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

చినుకు పడితే చెరువే..

- ఇదీ శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ దుస్థితి
- నగరంలో రహదారులు జలమయం

అరసవల్లి, జూన్ 27: చినుకు పడితే చాలు.. ఓ వైపు వర్షపు నీరు.. మరోవైపు కాలువల్లో ప్రవహించే మురుగునీటితో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ చెరువును తలపిస్తోంది. గమ్యస్థానాలు చేరుకునేందుకు కాంప్లెక్స్‌కు వచ్చిన వేలాదిమంది ప్రయాణికులకు ఈ దుస్థితి.. నరకం చూపిస్తోంది. సంవత్సరాలు గడుస్తున్నా, నాయకులకు, అధికారులకు ఎన్ని విన్నపాలు చేసుకుంటున్నా.. సమస్యకు పరిష్కారం చూపని పరిస్థితి నెలకొంది.

శ్రీకాకుళంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. డ్రైనేజీ వ్యవస్థలోని లోపాలతో నగరంలోని కృష్ణాపార్కు జంక్షన్, పొట్టి శ్రీరాములు జంక్షన్‌తో పాటు పలు ముఖ్య కూడళ్లు జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు బయటకు పోయేలా సరైన డ్రైనేజీ లేక.. ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. కాంప్లెక్స్ వద్ద నిర్మించిన కాలువలు రెండు అడుగుల ఎత్తులోనే ఉన్నాయి. ఈ కాలువలు మునిసిపల్ ప్రధాన కాలువకు అనుసంధానమై ఉన్నాయి. కాగా వర్షం పడితే హడ్కో కాలనీ, బలగ ప్రాంతాల నుంచి మునిసిపల్ ప్రధాన కాలువల ద్వారా వచ్చే నీరు, చెత్తా, చెదారం పేరుకుపోతుంది. దీంతో కాంప్లెక్స్ నుంచి వచ్చే నీరు, ఈ మునిసిపల్ కాలువల్లో ప్రవహించేందుకు వీలులేక నిలిచిపోతోంది. వర్షపునీటితో పాటు, మురుగునీరు కాంప్లెక్స్ ఆవరణ అంతా నిండి.. చెరువును తలపిస్తోంది. మునిసిపల్ అధికారులు ఎప్పటికప్పుడు బలగ, హడ్కో కాలనీల నుంచి వచ్చే కాలువల్లో చెత్తా, చెదారాన్ని తొలగిస్తే కాంపెక్స్‌లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు.. మునిసిపల్ అధికారులకు పదేపదే విన్నవించినా.. నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద మురుగునీటిలో ప్రయాణికులు


శ్రీకాకుళంలో జలమయమైన రహదారి..వాహనదారుల ఇబ్బందులు

మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసు పరిష్కారం


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

గుజరాతీపేట, జూన్ 27: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. గురువారం కోర్టు ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో టీపీ(సీ)2542/2022, అలాగే హెచ్ఎంఓపీ 29/2017 ఏఎస్‌జేసీ కోర్టును మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కుటుంబ కలహాలు రావడం సహజం కానీ వాటిని సరిదిద్దుకున్న రోజున సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, చైర్మన్ జి.సువర్ణరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మత్స్యకారుల బతుకులు బాగుపడేనా?

- జిల్లాలో కానరాని జెట్టీలు, ఫిషింగ్ హార్బర్
- కోల్డ్‌స్టోరేజీలు లేక ఇబ్బందులు
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- వలసబాట పడుతున్న గంగపుత్రులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

(టెక్కలి)

జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకు 193 కిలోమీటర్ల సువిశాల సాగరతీరం ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో మత్స్యకారులు ఉన్నారు. స్థానికంగా ఉపాధి కరువై చాలామంది మత్స్యకారులు ఒడిశాలోని పారాదీప్, గుజరాత్‌లోని కాండ్లా, చెన్నై, అండమాన్ ప్రాంతాలతో పాటు విశాఖ, గంగవరం, కాకినాడ పోర్టు ప్రాంతాలకు వలసలు పోవడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో ఏటా పదుల సంఖ్యలో మత్స్యకారులు మృత్యువాత పడుతున్నారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకులు మాత్రం మారడం లేదు. ఏళ్ల తరబడి ఫిషింగ్ హార్బర్ కేంద్రాలు, జెట్టీలు ఏర్పాటు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారులను ఉద్ధరిస్తామని ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద జెట్టీలు ఏర్పాటు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రాంత పర్యటనలో హామీ ఇచ్చారు. అప్పటి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కూడా తాను మత్స్యకారులకు ప్రత్యేకించి ఏదో ఉద్ధరిస్తున్నట్లు ఢాంబికాలు పలికారు. అయితే, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు చేసింది శూన్యం. బుడగట్లపాలెంలో 40ఎకరాల స్థలంలో రూ.332.09 కోట్లతో జెట్టీ నిర్మిస్తామని చెప్పి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 786 బోట్లు ల్యాండింగ్, రోజుకు 26,100 ఎంటీ చేపల వేటకు సామర్థ్యం, 10 వేల మందికి ఉపాధి కల్పిస్తామని మత్స్యకారులకు గత ప్రభుత్వం నమ్మబలికింది. దీనికోసం వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ 12 నెలల పాటు సర్వే చేపట్టింది. కానీ పనులు మాత్రం చేపట్టలేదు. మంచినీళ్లపేట వద్ద ఫిషింగ్‌హార్బర్ అంటూ హడావుడి చేసి కేవలం మట్టిపోసి వదిలేశారు. దీంతో తీరప్రాంతాల్లో హార్బర్లు లేక, జెట్టీలు లేక స్థానిక మత్స్యకారులు వలసబాట పడుతున్నారు.


వలలు కుట్టుకుంటున్న మత్స్యకారులు

- జిల్లాలో సాగర తీరం: **193 కిలోమీటర్లు**
- మత్స్యకార మండలాలు: **11**
- గ్రామాలు: **154**
- మత్స్యకార జనాభా: **1.08 లక్షలు**
- చేపల వేట సాగించేవారు: **14,280 మంది**
- వేటపై జీవించే కుటుంబాలు: **30 వేలు**
- చిన్నపడవలతో ఉపాధి పొందేవారు: **8 వేలు**
- సాధారణ పడవలు: **5,070**
- రిజిస్ట్రేషన్ చేసిన బోట్లు : **3,584**

కోల్డ్‌స్టోరేజీలు ఎక్కడ?

జిల్లాలో చేపలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లు లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. తీరంలో కోనెం, వంజరాలు, చందవలు, రొయ్యలు, నెత్తళ్లు, మాగలు, గులివిందలు, కానాగత్తలు, తుంబడాలు, చిదుములు, కలవలు, కారపరిగలు వంటి మత్స్య సంపద లభిస్తున్నా వాటిని నిల్వ ఉంచేందుకు ఒక్క కోల్డ్‌స్టోరేజ్ కూడా లేదు. దీంతో విశాఖ ప్రాంతం నుంచి వచ్చే దళారీలకు సగం ధరలకే చేపలను అమ్మకాలు చేస్తున్నారు. దళారీలు తీరప్రాంత ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు దశాబ్దాలుగా కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం కోసం పాలకులు హామీలు గుప్పించారే తప్ప అమలు చేయలేదు.

మంత్రి అచ్చెన్నపైనే ఆశలు..

జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జిల్లా మత్స్యకారులు ఆయనపైనే ఆశలు పెట్టుకున్నారు. తీర ప్రాంతాల్లో మంత్రి పర్యటించి మత్స్యకారుల కష్టాలను గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు. అవసరమైన బోట్లు, పడవలు, వలలు, ఇంజన్లు, ఇతర సామాగ్రి సమకూర్చాలని వేడుకుంటున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో తమకు మంచిరోజులు వస్తాయని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.



ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు: 2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు




ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

పది రోజుల వర్క్ బ్యాలెన్స్



ఒక సినిమా తర్వాతే మరో సినిమా చేయడం తమిళ దర్శకుడు శంకర్‌కు అలవాటు. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ఆయన ఒకేసారి రెండు సినిమాలు.. 'భారతీయుడు 2', గేమ్‌ఛేంజర్ చేయాల్సి వస్తోంది. విశిష్ట నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుండడంతో కాస్త ఊపిరి తీసుకున్న శంకర్ ఒకపక్క 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ మీద కూడా దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి అప్‌డేట్ వచ్చి చాలా కాలం అవుతోంది. 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో గేమ్‌ఛేంజర్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇంకో పది రోజుల వర్క్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' విడుదల కాగానే ఆ వర్క్ మొదలుపెడతాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తా. అవన్నీ పూర్తయ్యాక విడుదల ఎప్పుడనేది నిర్ణయిస్తా. సాధ్యమైనంత వరకూ తొందరగానే 'గేమ్‌ఛేంజర్' రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ వెల్లడించారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'గేమ్‌ఛేంజర్' లో కియారా అద్వానీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సంక్రాంతి బరిలో అజిత్ చిత్రం



తమిళ అగ్రకథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అదిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అజిత్ బ్లాక్ షేడ్స్ ధరించి , ఖైదీ డ్రస్‌లో కనిపించారు, ఆయన చేతి మీద ఉన్న టాటూ, బ్యాక్ గ్రౌండ్‌లో మ్యాసివ్ గన్ ఫైరింగ్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. ఈ పోస్టర్‌లోనే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. దీంతో సంక్రాంతి బరిలో మరో చిత్రం చేరనట్లయింది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఫొటోగ్రఫీ: అభినందన్ రామానుజం, ఎడిటింగ్: విజయ్ వేలుకుట్టి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేశ్ నరసింహన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

ఇక్కడే నా జీవితం మొదలైంది

రష్మిక భావోద్వేగం



ఒక పక్క అల్లు అర్జున్, ఇంకో పక్క ధనుష్, ఆ పక్క సల్మాన్‌ఖాన్. ఇవీ కాకుండా జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రంలోనూ, ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలోనూ ఆమె హీరోయిన్ అంటున్నారు. అలాగే 'గర్ల్‌ఫ్రెండ్' పేరుతో చేస్తున్న లేడీ ఓరియంటెట్ సినిమా ఉండే ఉంది. ఇలా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో రష్మిక హవా మాములుగా లేదు. ఇంత బిజీగా ఉన్న ఆమె తీరిక చేసుకుని చిన్ననాటి స్నేహితురాలు వివాహానికి తను పుట్టి పెరిగిన ఊరు 'కొడగు' వెళ్లింది. కర్నాటక రాష్ట్రంలోని ఆ ప్రాంతానికి వెళ్లగానే బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో భావోద్వేగానికి లోనయ్యారు. 'కొడగు.. నా హృదయం, నా చరిత్ర. జీవితం ఇక్కడే మొదలైంది' అంటూ ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. చిన్ననాటి స్నేహితురాళ్లను కలుసుకొని ఆ నాటి ముచ్చట్లను గుర్తు చేసుకుని మురిసిపోయింది.

రిలీజ్ డేట్ వచ్చేసింది



తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను గురువారం మేకర్స్ ప్రకటించారు. దసరా కానుకగా అక్టోబర్ 10న చిత్రం దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

చిత్ర పరిశ్రమకు మంచి రోజులు

- ఎన్వీ ప్రసాద్



గడ్డుపరిస్థితుల్లో ఉన్న చిత్రపరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రపంచంలోనే ఉన్నతస్థితికి చేరిందన్నారు. గతంలో రాజకీయ హింసలకు గురై దినదినగండంగా ఉండేదని గుర్తుచేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌లతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. 'కల్కి' సినిమా సంచలన విజయం సాధించడం శుభపరిణామమన్నారు. కూటమి విజయంవలే సినీ పరిశ్రమ కూడా 'కల్కి'తో మంచి విజయాన్ని అందుకుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలను కలిసి సినీ పరిశ్రమకు ఒకేరకమైన విధివిధానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. ఏపీలో కూడా సినీ పరిశ్రమ వికసిస్తుందన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగు పరిశ్రమ అందిపుచ్చుకుందని, రాష్ట్రంలో కూడా తెలుగు సినిమాల షూటింగులు విరివిగా జరుపుకోనున్నాయన్నారు. ఇక్కడ స్టూడియోలు లేకపోయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో తాత్కాలిక సెట్లు వేసుకుని షూటింగులు చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)

'కల్కి' టీమ్‌కు థ్యాంక్స్



దర్శకుడిగా ఎన్నో సంచలన చిత్రాలను తెరకెక్కించి ఎంతో మంది నూతన దర్శకులకి ఆదర్శప్రాయుడిగా నిలిచిన రామ్‌గోపాల్‌వర్మ.. 'కల్కి 2898 ఏ.డీ' సినిమాతో కొత్త అవతారం ఎత్తారు. గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంలో ఓ అతిథి పాత్రలో మెరిశారు. ఇన్నేళ్ల సినీరంగంలో ఉన్న ఆయన.. ఓ సినిమాలో నటించడం మాత్రం ఇదే ప్రథమం. ఇందులో ఆయన పాత్ర చిన్నదైనా ఎంతో వినోదాత్మకంగా ఉందని సినిమా చూసిన వారంతా అనడం విశేషం. ఈ సందర్భంగా చిత్రబృందానికి, డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి.. ఇందులో నటించిన వారందరినీ ప్రశంసించారు. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్టుకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ చిత్ర కథ మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగేలా తెరకెక్కింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్,దుల్కర్ సల్మాన్, విజయ్‌దేవరకొండ, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి, స్వాస్థ చటర్జీ, దీపికా పదుకొనే, దిశా పటానీ, మాళవిక నాయర్, శోభన, అన్నా బెన్ కీలక పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cx6B3gN లో చదవండి.

జీడి పిక్కల బస్తాకు రూ.16 వేల ధర ప్రకటించాలి

● ఎమ్మెల్యే శిరీషను కోరిన రైతాంగ సమస్యల సాధన కమిటీ

పలాస: జీడిపిక్కల బస్తాకు రూ.16వేలు కనీస మద్దతు ధర ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం సాయంత్రం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో జీడి పంటపైనే ఆధారపడి రైతులు బతుకుతున్నారని తెలిపారు. మద్దతు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.9వేలు ధర ఉన్నపుడు రూ.వెయ్యి ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వంశధార కాలువను ఉద్దానం గ్రామాల మీదుగా ఇచ్ఛాపురం వరకూ పొడిగించాలని, రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు శిరీషకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.మాధవరావు, కార్యదర్శి జి.చలపతిరావు, కోశాధికారి ఎం.ధర్మారావు, సింహాద్రి, గున్నయ్య, తవిటయ్య, దుర్యోధన, వీరాస్వామి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిరీషను అభినందిస్తున్న రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు

ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

పలాస నియోజకవర్గంలో సాగునీటి వనరులపై ఇరిగేషన్ అధికారులతో స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళింగదళ్, డబారుసింగి, దామోదర్‌సాగర్, వరహాలుగెడ్డ వంటి రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితి ఏమిటని అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో అన్నిగ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. పెద్దమురహరిపురం పంచాయితీకి మంజూరైన ఎంపీ నిధులు రూ.22 లక్షలతో అభివృద్ధి పనులకు గురువారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గొరకల వసంతస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీ నిధులు పలస నియోజకవర్గానికి మంజూరుకాకుండా మాజీ మంత్రి అప్పలరాజు అడ్డుకున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో సర్పంచ్‌లకు ఎలాంటి అధికారం, నిధులు అందించకుండా నాయకత్వం అడ్డుకుందన్నారు. అభివృద్ధి కోరుకునే సర్పంచ్‌లకు తాము పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పెద్దముమహరిపురంలో రోడ్డు విస్తరించాలని కోరగా నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, దున్న షణ్ముఖరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, శశిభూషణ్, దుర్యోధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

హరిపురం: వైసీపీ ప్రభుత్వంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రేషన్ డీలర్లను ఆదుకొని సమస్యలు పరిష్కరించాలని మందస మండల డీలర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు వైఎస్ఎన్ మూర్తి, సీహెచ్ లక్ష్మణరావులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మురళి, శిష్టు బైరాగి, ప్రకాష్ పాత్రో, ఈశ్వరరావు, మోహనగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించండి

మందస: మందస పట్టణంలోని రాజాశ్రీనివాసా మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, దీని అభివృద్ధికి సహకరించాలని పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, సీతారామశర్మ, శిష్టు సోమనాథం, ప్రభాకర పట్నాయక్, తిరుపతి సంహాచలం, శ్రీనివాస్, డి.తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీషను సత్కరించారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును సత్కరిస్తున్న డిగ్రీ కళాశాలల సంఘ ప్రతినిధులు

డిగ్రీ కళాశాలల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

టెక్కలి: జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు రాష్ట్ర డిగ్రీ కళాశాలల సంఘ ప్రతినిధులు గురువారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. ఏపీసీటీఈలో ఉన్న సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖ ఎంపీ భరత్‌ను కలిశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు కోత మురళీధర్, పొన్నాడ జయరాం, బొంతు శ్రీనివాస్, గుండారెడ్డి, వెంకటరెడ్డి, విజయభాస్కర్, సుబ్బారెడ్డి, రామన్‌జీ తదితరులు ఉన్నారు. అనంతరం ఎంపీని దుశ్శాలువతో సత్కరించారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

● మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

టెక్కలి: నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో తాగునీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఆదేశించారు. టెక్కలికి తాగునీరు సరఫరా చేసే పూజల చెరువు పూర్తిగా ఎండిపోయిందన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ప్రత్యేకంగా రూ.20 లక్షలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. కంద్రవీధి, బ్రాహ్మణవీధి, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస్‌నగర్, రోటరీ నగర్, ఎన్టీఆర్ కాలనీ, మెట్టవీధి, చిన్నబజారు, గొల్లవీధి, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పట్టణ శాఖ అధ్యక్షులు కోళ్ల లవకుమార్‌లు వీటిని పర్యవేక్షించాలని సూచించారు.

ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు అభినందన

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును జనసేన నాయకులు కొరికాన భవాని, గేదెల క్రాంతి, సిరిపురం సందీప్ తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కలిసి ఆయనను అభినందించారు.

మట్టి నమూనాలను సేకరించండి

పోలాకి: రైతులు తమ పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు. పోలాకి ఆర్బీకే కేంద్రంలో రైతులతో మాట్లాడుతూ మట్టి నమూనాల ద్వారా పొలంలో ధాతు లోపాన్ని గుర్తించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలన్నారు. విత్తనాలు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

అనధికారికంగా ఇసుక తరలిస్తే చర్యలు

పోలాకి: వంశధార నదీ తీర గ్రామాల నుంచి అనధికారికంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాదరావు హెచ్చరించారు. వనితమండలం, జొన్నాం, మబగాం, పల్లిపేట, కొత్తరేవు సమీప గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక అవసరమైతే ముందుగా తమను కార్యాలయంలో సంప్రందించాలన్నారు. అక్రమ నిల్వలు చేస్తు తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: నిర్వహణ పనుల్లో భాగంగా మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జి.శంకరరావు తెలిపారు. హిరమండలం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

బాధితురాలికి పరామర్శ

పలాసరూరల్: పలాస పట్టణం తాళభద్రకు చెందిన కార్మికురాలు ఇటీవల సిమెంట్ మిక్సర్ ప్రమాదంలో గాయపడి... కిడ్నీ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. దీంతో ఆమెను టీడీపీ నాయకులు గురువారం పరామర్శించి ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి, నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, బదడ ఉమాకాంత్ తదితరులు ఉన్నారు.

ఇళ్లు పరిశుభ్రంగా ఉండాలి

మెళియాపుట్టి: ప్రతి ఇంటినీ పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామం శుభ్రంగా ఉంటుందని కార్యదర్శి చింతల అప్పారావు తెలిపారు. గురువారం మెళియాపుట్టిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. తాగు నీటి పథకాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పలాస రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలాస డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ ఆదేశించారు. పలాస మండలం గురుదాసుపురం, బొడ్డపాడు గ్రామ పంచాయతీలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పారిశుధ్యం, ట్యాంకుల క్లోరినేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.రూపవతి, టి.మదన్, పంచాయతీ కార్యదర్శులు ఎన్.మీనాకుమారి, ఖగేశ్వరరావు, కుత్తుమ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాతపట్నం: పశువులకు గొంతు వాపు, జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. పెద్దలోగిడి గ్రామంలో గురువారం జరిగిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాలు శాతశాతం వేసేందుకు క్షేత్రస్థాయి అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.కె.మౌనిక, సిబ్బంది నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

దేవతా ఉత్సవాలతో సందడి

గొల్లలవలస (పోలాకి): గొల్లలవలస, గంటపేట, పోలాకి, రుంకుజగన్నాథపురం, నుసరాం, చెల్లాయివలస గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలతో సందడి నెలకొంది. గొల్లలవలసలో గ్రామదేవతకు మహిళలు ముర్రాటలు సమర్పించారు. ఖరీఫ్ పనులు ప్రారంభించక ముందు గ్రామదేవతలను పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

యువతకు బాసటగా సైనిక్ సేవాదళ్

వజ్రపుకొత్తూరు: డోకులపాడులో యువత కోసం గ్రామానికి చెందిన సైనిక్ సేవా దళ్ సభ్యులు వ్యాయామ కిట్లు, పరికరాలను గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కరుణాకర్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కాపుతెంబూరులో పారిశుధ్య కార్యక్రమాలు

నందిగాం: మండలంలోని కాపుతెంబూరు గ్రామంలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచనల మేరకు స్థానిక యువజన నాయకులు కొల్లి హరిబాబు నేతృత్వంలో ప్రత్యేక పారిశుధ్య కార్మికులతో మురికి కాలువల్లో పూడికలను తొలగించారు. తాగునీటి వనరుల పరిసరాలు, మురికి గుంటల పరిసరాలను శుభ్రం చేశారు.

అక్రమ నిర్మాణాల తొలగింపుపై చర్చ

పాతపట్నం: పాతపట్నంలో అక్రమ భవన నిర్మాణాల తొలగింపుపై చర్చలు జరపాలని పలువురు సభ్యులు సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సిర్ల వేణుకుమారి అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. స్థానిక అమ్మవారి గుడి కాలనీ వద్ద వీధి రహదారికి అడ్డంగా ఉన్న అక్రమ భవన నిర్మాణం తొలగింపుపై హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై సమావేశంలో చర్చకు రాగా.. ఫిర్యాదుదారులు, బాధితులతో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకోవాలని సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో ఈవో కూర్మారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వంశధార కాలువ మ్యాప్‌ను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఖరీఫ్‌నకు పూర్తి స్థాయిలో నీరందించాలి

జలుమూరు: ఖరీఫ్ సీజనుకు రైతులు పండించే వరిపంటకు పూర్తిస్థాయిలో సాగు నీరందేలా చర్యలు చేపట్టాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. పెద్దదూగాం వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువతో పాటు 24 ఎన్‌బీసీ కాలువను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కాలువల గుండా శివారు ప్రాంతాలకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ గట్లు బలహీనంగా ఉన్నచోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరు ప్రవహించేలా చూడాలన్నారు. శివారు ప్రాంత రైతులకు గత ఐదేళ్లుగా సాగునీరందక తీవ్రంగా నష్టపోయారని విచారం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనతో వంశధార డీఈ బి.శ్రీహరి, జేఈ సురేష్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, మండల కన్వీనరు బగ్గు గోవిందరావు, చల్లవానిపేట, లింగాలవలస సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, నాయకులు గుండ రామకృష్ణ, పిరియా వెంకటరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం ఛాయ, ఉషా, పద్మినీ సమేత శ్రీ సూర్యనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా పూజలు చేశారు. అర్చకుడు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు శిమ్మ గోకుల్, శివరంజని, కింజరాపు ఉమ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నరసన్నపేట: కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని రైతు సంఘ నాయకులు వల్లంశెట్టి గిరి రెవెన్యూ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన పంట సాగుదారుల హక్కుల చట్టాన్ని సవరించి... కౌలు రైతులకు స్వీయ ధ్రువీకరణ ఆధారంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. పంట రుణాలు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. పంట కాలువల్లో పూడికను, గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

యువతను నడిపించేవి గ్రంథాలే

హరిపురం: సమాజ అభివృద్ధికి, యువత సన్మార్గంలో నడిచే మార్గాన్ని చూపించటంలో గ్రంథాలే కీలక పాత్ర పోషిస్తాయని విశ్రాంత వైద్యులు యాగిరెడ్డి రామినాయుడు అన్నారు. మఖరజోల గ్రామం రామలింగేశ్వరాలయం వద్ద జనజాగృతి సాహితీ సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో పైల మల్లేశం మాస్టారు రచించిన భవాని త్రిశతి గ్రంథాన్ని గురువారం ఆవిష్కరించారు. డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ద్విభాషా పండితులు సత్యనారాయణ మూర్తి, పైడి హరినాథ్, బమ్మిడి సుబ్బారావులు మాట్లాడుతూ గ్రంథ ప్రాచుర్యాన్ని వివరించారు. అనంతరం ఎమ్.సుదీప్త శాస్త్రీయ నృత్యం, ఉలాల నందు, మడ్డు తిరుపతిరావుల మేధా సంపత్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పైల మురళి, నేతాజీ, ఎల్.వెంకటాచలం, గుంట చక్రపాణి, కొర్ల కన్నారావు, బమ్మిడి కర్రయ్య, శ్రీనివాస్. బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



భవాని త్రిశతి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రామినాయుడు

జోరు వర్షం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. టెక్కలి, నరసన్నపేట, హిరమండలం, నందిగాం తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగి పొర్లాయి.

- (ఆంధ్రజ్యోతి బృందం)



నరసన్నపేట: ఉమామహేశ్వర ఆలయ ముందుభాగంలో వరదనీరు



హిరమండలంలో...



మెళియాపుట్టిలో కురుస్తున్న వర్షం



నందిగాం: తురకలకోట వద్ద వర్షం పడుతున్న దృశ్యం



ఎల్.ఎన్.పేటలో కురుస్తున్న వర్షం



జలుమూరు: పొలాల్లో చేరిన వర్షపు నీరు



గార: బూరవెల్లి రోడ్డుపై..



లావేరు: సుభద్రాపురం జంక్షన్‌లో..

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మందస: పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు సూచించారు. మందస మేజరు పంచాయతీలో గురువారం ఆయన పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి బ్లీచింగ్ చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘుపతిరావు, ఏవో ఖగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు జయప్రకాశ్, ఈవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మందసలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు





తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి

పలాసరూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి వారికి రుణాలను మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు తహశీల్దార్ ఎస్‌వీఎస్ఎస్‌నాయుడును కోరారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. కౌలు రైతులు సరైన ఆదాయం లేక.. అప్పులు చేసి భూములను సాగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డులతో పాటు రుణాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సీహెచ్.వేణు, తిరుపతిరావు, సుందరరావు పాల్గొన్నారు.

జిల్లా యువకుడి కిడ్నాప్ కేసులో 11మంది అరెస్టు

● విజయనగరం జిల్లా రాజాంలో ఘటన.. నిందితులకు రిమాండ్

రాజాం రూరల్: శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువకుడ్ని కిడ్నాప్ చేసి, మారణాయుధాలతో తీవ్రంగా గాయపరిచిన కేసును విజయనగరం జిల్లా రాజాం పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో 11 మందిని అరెస్ట్ చేశారు. వారిపై కిడ్నాప్, హత్యాయత్నం కేసుతో పాటు మరికొన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ స్పష్టం చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా.. న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ వివరించారు. ఇదే కేసులో భాగస్వామ్యులైన ముగ్గురు మైనర్లపై కూడా కేసు నమోదు చేసి ఈ నెల 28న కోర్టులో హాజరుస్తామన్నారు. రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సంతకవిటి ఎస్ఐ షేక్ శంకర్‌తో కలిసి గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. రాజాం పట్టణంలోని గొల్లవీధికి చెందిన కొంతమందికి గురవాం గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్, అతని స్నేహితులకు కొన్నాళ్లుగా పాత కక్షలున్నాయి. ఇరువర్గీయులూ తరచూ గొడవలు పడుతున్నారు. ఈనెల 25న రాజాంలోని గొల్లవీధిలో జరిగిన శుభకార్యానికి శ్రీకాకుళం పట్టణం గుజరాతీపేటకు చెందిన కొంతమంది హాజరయ్యారు. అదే రోజు గొల్లవీధికి చెందిన వ్యక్తులతో పాటు శ్రీకాకుళం నుంచి వచ్చిన యువకులు మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటలో డొంకల మిల్లు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగి ఉన్న కుప్పిలి నవీన్, అతని స్నేహితులు గొల్లవీధికి చెందిన యువకులతో వాగ్వాదానికి దిగారు. తమపై నవీన్ వర్గం దాడి చేస్తారని గమనించిన గొల్లవీధి యువకులు వారినుంచి తప్పించుకుని పరారయ్యారు. నవీన్ వర్గం కోపంతో రగిలిపోతూ శ్రీకాకుళం పట్టణానికి చెందిన గౌతంను పట్టుకున్నారు. బలవంతంగా అతడిని ద్విచక్ర వాహనంపై గురవాం సమీప మామిడితోటలోకి ఎత్తుకెళ్లారు. గౌతంకు రక్తం వచ్చేలా కొట్టారు. ఏడ్చినా నవీన్ వర్గం పట్టించుకోలేదు. అక్కడితో ఆగకుండా గౌతం ఫొటోలను సెల్‌లో తీసి రాజాంలోని గొల్లవీధికి చెందిన వ్యక్తులకు పంపించారు. వీటి ఆధారంగా గౌతం ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, పోలీస్ వాహనంలో అతడ్ని తీసుకొచ్చి రాజాంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. ప్రస్తుతం గౌతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆ 11 మంది వీరే..

కిడ్నాప్, హత్యాయత్నం కేసుతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన వారిలో కుప్పిలి నవీన్, దుర్గాసాయి, గంటా ప్రదీప్, కుప్పిలి ధనుంజయ, టొంపల అనిల్‌కుమార్, తోలేటి ఉదయ్‌కుమార్, సూరపాటి సాయికుమార్, టొంపల రవిచైతన్య, తిరంగి అక్షయ్‌కుమార్, కొర్ల ఫణీంద్ర, చింతాడ విద్యాసాగర్ ఉన్నారు. వీరిలో కుప్పిలి నవీన్‌కుమార్‌పై గతేడాది అక్టోబరులో గంజాయి కేసు నమోదై ఉందని, రౌడీషీట్ కూడా ఓపెన్ చేసి ఉందని సీఐ శ్రీనివాస్ వివరించారు. వీరందరికీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలి మృతి


సురేష్ (ఫైల్)

కవిటి: ఉపాధి కోసం కేరళకు వలస వెళ్లిన కరాపాడు గ్రామానికి చెందిన నర్తు సురేష్ (కాశీప్రసాద్) విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు ఇటీవలే కేరళకు వెళ్లాడు. గురువారం తను పనిలో భాగంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆకస్మాతుగా విద్యుదాఘాతానికి గురై తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని గ్రామస్థులకు సమాచారం అందింది. కాగా సురేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. కొన్నేళ్ల కిందటే తండ్రి మృతి చెందగా.. తల్లి మోహిని ఉన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

ఎచ్చెర్ల: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు నమ్మించి మోసం చేశాడన్న ఫిర్యాదుపై గురువారం అతడ్ని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. ఆ బాలిక ఆ యువకుడితో సన్నిహితంగా ఉండటాన్ని ఆమె కుటుంబ సభ్యులు గుర్తించి మందలించారు. దీనిపై ఆమె మనస్తాపానికి గురై ఇటీవల బాత్రూమ్ క్లీనర్ లిక్విడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆ బాలికను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ గనగళ్ల గణేష్‌పై పోక్సో, అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి, అతడి అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

భూ తగాదాలో ఒకరికి గాయాలు

నందిగాం: దేవళభద్రలో గురువారం జరిగిన భూ తగాదాలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దీర్ఘాసి జనార్దనరావు, ఆదినారాయణ అన్నదమ్ములు. ఉమ్మడి ఆస్తికి సంబంధించి 40 సెంట్లను ఆదినారాయణ దున్నుతుండడంతో జనార్దనరావు ప్రశ్నించాడు. వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.. ఈ క్రమంలో జనార్దనరావు పారతో దాడి చేయడంతో ఆదినారాయణ తలపై గాయమైంది. ఈయన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

అరసవల్లి/ శ్రీకాకుళం క్రైం: నగరంలోని బలగ ప్రాంతంలో గల గిరిజన సంక్షేమ వసతి గృహంలోని తొమ్మిది మంది విద్యార్థులు బయట కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బుధవారం వసతి గృహంలోని తొమ్మిది మంది విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నూడిల్స్ తిని వసతి గృహానికి చేరుకున్నారు. అయితే తిన్న ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. కానీ హాస్టల్‌లో వార్డెన్‌తో పాటు సహాయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉదయం 9గంటలకు వార్డెన్ వసతి గృహానిక చేరుకునేసరికి విద్యార్థుల పరిస్థితి విషమించింది. అయితే వారికి సపర్యలు చేసినప్పటికీ మధ్యాహ్నానికి వారి పరిస్థితి విషమించడంతో మూడు గంటల ప్రాంతంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఐదుగురికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

ఏడు మున్సిపల్ షాపులు సీజ్

ఇచ్ఛాపురం: అద్దెలు చెల్లించకపోవడంతో మున్సిపాల్టీ పరిధిలో గల ఏడు షాపులను సీజ్ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.లక్షల్లో అద్దెలు బకాయలు ఉండడంతో హాస్పటల్ రోడ్డులో గల నాలుగు షాపులు, సరాబి వీధి జంక్షన్ వద్దగల మూడు షాపులను సీజ్ చేశామని తెలిపారు. అద్దె బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో చర్యలు చేపట్టామన్నారు. తిరిగి బకాయిలు చెల్లిస్తే షాపులు నడుపుకొనేందుకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఆక్రమణల తొలగింపు

జలుమూరు: సైరిగాం ప్రాంతంలో గల 14ఆర్ కాలువ ఆక్రమణలు గురువారం రెవెన్యూ అధికారులు తొలగించి కాలువను ఆధునికీరించారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. గొటివాడ పాపమ్మ కోనేరు నుంచి గాదిబంద వరకు సుమారు 3 కి.మీ పొడవున కాలువ ఆక్రమణలు తొలగించారు. సైరిగాం ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యవసాయం చేస్తున్న స్థలాల్లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టారు. ఆధునికీకరణ వల్ల సుమారు 100 ఎకరాలు వ్యవసాయ భూములకు సాగునీరందుతుందని రైతులు తెలిపారు.

బెల్లం ఊటల ధ్వంసం

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ పట్టులోగాం గ్రామంలో సెబ్ అధికారులు, సీఐ జైభీం ఆధ్వర్యంలో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1900 లీటర్లు బెల్లం ఊటలు, 40 లీటర్లు సారా స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. సారా తయారీ, రవాణాపై పూర్తి నిఘా పెట్టినట్టు ఆయన చెప్పారు. ఎవరైనా అమ్మకాలు, తయారీ చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తయారీ వివరాలను 94409 02358 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో సోంపేట, పలాస ఎక్సైజ్ అధికారులు రామచంద్ర కుమార్‌తోపాటు సిబ్బంది కాంతారావు, భీమారావు, మోహనరావు పాల్గొన్నారు.

సారా పట్టివేత

కవిటి: కరాపాడ గ్రామం వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో దూగాన పుట్టుగ గ్రామానికి చెందిన దూగాన డిల్లేశ్వరరావు సారా ప్యాకెట్లతో పట్టుబడినట్టు ఎస్ఈబీ సీఐ విజయలక్ష్మి తెలిపారు. ఒడిశా రాష్ట్రం తూటుపూర్ నుంచి 50 సారా ప్యాకెట్లు బైక్‌పై తరలిస్తూ పట్టుకున్నట్టు తెలిపారు. బైక్‌ను సీజ్ ఆ వ్యక్తిని అరెస్టు చేశామన్నారు.

పీజీ సెట్‌లో మెరిశారు..

ఏపీ పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. గురువారం పీజీ సెట్ ఫలితాలు వెలువడ్డాయి. వివిధ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు.

ఎలక్ట్రానిక్స్ విభాగంలో స్టేట్ ఫస్ట్


పూజిత

జి.సిగడాం: ఎందువ గ్రామానికి చెందిన పూజిత ఏపీ పీజీ సెట్‌లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచింది. రైతు కుటుంబంలో పుట్టిన పూజిత సత్తా చాటడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎందువ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో, డిగ్రీ రాజాంలో పూర్తిచేసింది. తల్లిదండ్రులు చంద్రశేఖర్, వీరలక్ష్మి వ్యవసాయం చేసుకుంటూ కుమార్తె పూజితకు ఉన్నత విద్యనందించారు. పూజిత ప్రతిభపై గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

వృక్షశాస్త్రం నుంచి రుక్మిణి..


రుక్మిణి

టెక్కలి: ఆంధ్రా యూనివర్సిటీ ప్రకటించిన పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో వృక్షశాస్త్రం విభాగంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నీలాపు రుక్మిణి మొదటి ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయిలో రుక్మిణి మొదటి ర్యాంక్ సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు వాసుబాబుకి, రుక్మిణికి స్థానికులు అభినందించారు.

అనిల్‌కు 12వ ర్యాంకు


అనిల్‌కుమార్

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన పొన్నాడ అనిల్ కుమార్ పీజీ సెట్‌లో ఫిజికల్ సైన్స్ విభాగం నుంచి 12వ ర్యాం కు సాధించాడు. ఈయన తల్లిదండ్రులు సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలో జరిగింది.

ఎడ్‌సెట్‌లో 3వ ర్యాంక్


ఉదయకుమార్

సంతబొమ్మాళి: సంతబొమ్మాళికి చెందిన లక్కోజి ఉదయకుమార్ ఏపీ ఎడ్‌సెట్‌లో ప్రతిభ చూపాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో గణితం విభాగంలో 102 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. ఉదయ్‌కుమార్ తండ్రి వెంకటరమణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి గృహిణి.

ప్రగతికి 13వ ర్యాంకు


ప్రగతి

జలుమూరు: చల్లవానిపేట కూడలికి చెందిన అక్కాజోష్యుల ప్రగతి ఏపీ పీజీసెట్‌లో 13వ ర్యాంకు సాధించింది. ప్రగతి 13వ ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి: ఎమ్మెల్యే గొండు


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాల విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ నగర పాలకోన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం జరిగిందని, పెద్ద ఎత్తున టీచర్ పోస్టులను భర్తీ చేశామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈవో విలియం, ఎంఈవో కృష్ణారావు, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు వీజీకే మూర్తి, జామి భీమశంకర్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కెల్ల కొండలరావు, నాయకులు, డివిజన్ ఇన్‌చార్జీలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో..

అలాగే గురువారం నగరంలో జోరున వాన కురిసింది. దీంతో ఎమ్మెల్యే గొండు శంకర్ మున్సిపల్ అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. తరచూ జలమయం అవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పాత బస్టాండ్, ఇలిసిపురం, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాలను సందర్శించి, జలమయమైన ప్రాంతాల వివరాలను, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో పరిష్కార మార్గాలపై చర్చించారు. అనంతరం శంకర్ నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి కమిషనర్ గంగాధరం పార్టీ నాయకులు ఉన్నారు.

మీసేవా కేంద్రాల్లో సేవలు కొనసాగిస్తాం


వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మీసేవా కేంద్రాల్లో సేవలు గతంలో వలే కొనసాగేలా ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని రవికుమార్ స్వగృహంలో నియోజకవర్గ మీసేవ కేంద్ర నిర్వాహకులు ఆయనను మర్యాదపూర్వకంగా తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచిన మీసేవ కేంద్రాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూత పడ్డాయని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. మీసేవలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకొని పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అన్నెపు రమణమూర్తి, మొదలవలస సురేష్, పప్పల హరనాథరావు, సనపల హరి ప్రతాప్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, అన్నెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి: ఎమ్మెల్యే ఎన్ఈఆర్


కార్యాలయం బయట కూర్చొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎచ్చెర్ల: ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని, దుప్పలవలస గురుకుల పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం 7.30 గంటలకే ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. గురుకుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకరిస్తానని హామీనిచ్చారు. ఆ తర్వాత ఆయన ఉదయం 9.45 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఉద్యోగులు వచ్చేంతవరకు కార్యాలయం బయటే కూటమి నేతలతో కలిసి కూర్చొన్నారు. అనంతరం సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల నిర్వహించిన మండల సమావేశానికి సంబంధించిన మినిట్ బుక్ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా, అందుబాటులో లేదన్న ఎంపీడీవో రమాదేవి చెప్పడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు వావిలపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు, కొత్తకోట అమ్మినాయుడు, పొందూరు భీమారావు, తమ్మినేని గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవస్థలను నిర్వీర్యం చేసింది వైసీపీయే'

రణస్థలం: వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) ఆరోపించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు నుంచే వైసీపీ అనుకూల మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలు నమ్మలేదన్నారు. ప్రజా మద్దతుతో 29 వేల మెజార్టీతో గెలిచానని.. దీనిని తట్టుకోలేక ఇప్పుడు కొత్త కథలు అల్లుతున్నారని ఆరోపించారు. యునైటెడ్ బేవరేజస్ పరిశ్రమలో యాజమాన్య ప్రతినిధులకు, కార్మికుల మధ్య చిన్నపాటి సమస్యలు వస్తే స్థానిక ఎమ్మెల్యేగా పరిష్కార మార్గం చూపితే.. వసూళ్లపర్వానికి దిగినట్టు ఆరోపించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా కమీషన్లు, వాటాలు అంటూ పరిశ్రమ యాజమాన్యాన్ని ఇబ్బందిపెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. 2019 వరకూ నెలలో 26 రోజుల పాటు కార్మికులకు ఉపాధి దక్కేదని.. రికార్డుస్థాయిలో ఉత్పత్తితో పరిశ్రమ ముందంజలో ఉండేదన్నారు. కానీ గత ఐదేళ్లుగా వైసీపీ నేతల ఒత్తిళ్ల మూలంగా పరిశ్రమలో ఉత్పత్తి తగ్గడంతో పాటు కార్మికులకు సరైన ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమ యాజమాన్యం ఎంతగానో ఆనందిస్తోందన్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్న వారిపై న్యాయపరంగా పోరాడుతానని ఎమ్మెల్యే ప్రకటించారు. టీడీపీ నేతలు ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, బెండు మల్లేశ్వరరావు, పిషని జగన్నాథంనాయుడు, సంధ్యా పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

జి.సిగడాం: జీవో 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ కోరారు. గురువారం సంతవురిటి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏపీటీఫ్ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘ నాయకులు సీర రాము, కె.రమేష్, పిట్ట అప్పారావు, సీహెచ్ జగదీశ్వరరావు, పి.తిరుమలరావు తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జి.సిగడాం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో 2,769 సుమోటో కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాల్సి ఉందన్నారు. వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు వారం రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

ఇచ్ఛాపురం: వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్ అన్నారు. గురువారం వార్డు పరిధిలో వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటితో పాటు చుట్టు పక్కల ప్రదేశాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్యదర్శి ప్రియాంక, ఏఎన్ఎం కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సురేఖ, జ్యోతి, ఆశావర్కర్లు సరోజర ఇందిర, రామలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

● పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదని అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వైపీ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో పారిశుధ్యం పై అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రవచనకర్త చాగంటి


స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి రంజిత్‌శర్మ, నేతింటి హరిబాబు, శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 29వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్య చంద్రరావు, జేకేసీ కో ఆర్డినేటర్ ఐ.లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, పేటీఎం, నవత ట్రాన్స్‌పోర్టు, ముత్తూట్, అరబిందో తదితర కంపెనీలు వస్తాయన్నారు. కనీస అర్హత డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి పాసై ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు ఏఎస్ఐలకు పదోన్నతి


పదోన్నతి పొందిన ఎస్ఐలతో ఎస్పీ, ఏఎస్పీలు

శ్రీకాకుళం క్రైం: ఇటీవల ఆరుగురు ఏఎస్‌లకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదోన్నతులు పొందిన జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్ఐలు కె.మన్మధరావు, ఎన్.కృష్ణారావు, ఎం.సుధాకర్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

శ్రీకాకుళం కల్చరల్: డీసీసీబీ కాలనీలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా చివరి రోజు గురువారం వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించారు. అర్చకులు చామర్తి జగన్నాథ ఆచార్యులు ఆధ్వర్యంలో బంతి, చామంతి, గులాబీలతో అష్టోత్తర నామార్చన, కుంకుమ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు దుంపల సన్యాసిరావు, బిర్లంగి రామోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో విజయదుర్గమ్మ



శ్రీకాకుళం కల్చరల్: నానుబాల వారి వీధిలో ఉన్న విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ, చందనంతో అభిషేకం చేసి, పుష్పాలంకరణ సేవ చేశారు.

ఘనంగా పెరుమాల్ కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం లక్ష్మీనారాయణ పెరుమాల్ కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల వేడుకల్లో భాగంగా సుదర్శనయాగం హోమాలతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు తమ్మినేని గీతవిద్యాసాగర్‌లతో పాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

డీసీసీబీల అఫీషియల్ పర్సన్‌గా జేసీ

శ్రీకాకుళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులకు జాయింట్ కలెక్టర్లను బాస్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం డీసీసీబీకు జాయింట్ కలెక్టర్‌ను అఫీషియల్ పర్సన్‌గా నియమిస్తూ గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. ఆరుమాసాల పాటు శ్రీకాకుళం డీసీసీబీకి జాయింట్ కలెక్టర్ నవీన్ అఫీషియల్ పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ, కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

డైట్ సెట్‌కు రెండో విడత కౌన్సెలింగ్

గార: డైట్‌సెట్ అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ చేసుకోవచ్చని వమరవల్లి డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జూలై 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సీట్లు అలాట్మెంట్ ఉంటుందన్నారు. జూలై 8వ తేదీన ప్రవేశానికి ప్రొవిజన్ లెటర్స్ ఇవ్వడం జరుగుతుందని 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు డైట్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌తో పాటు ప్రవేశానికి లెటర్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. విషయం డైట్ సెట్ అభ్యర్థులు గమనించాలన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా జయరాజ్

కంచిలి: మండల ప్రత్యేకాధికారిగా వి.జయరాజ్ నియమితులైనట్టు ఎంపీడీవో వి.నీరజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వి.జయరాజ్‌ను ఇక్కడ నియమించినట్టు తెలిపారు.

ఖాళీలు భర్తీ చేయండి

కంచిలి: ప్రభుత్వ గిరిజన సంక్షేమ, ఆశ్రమ, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని అపోటా ఆధ్వర్యంలో గిరిజన, మహిళా, శిశుసంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణికి గురువారం లేఖ రాసినట్టు సంఘ ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలో ఒడియా మాధ్యమంలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలపారు. ఒడియా మాధ్యమంలో ఎస్‌జీటీ 16 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్, లెక్కలు నాలుగు, ఫిజిక్స్ మూడు, బయోలజీ మూడు, సోషల్ మూడు, ఇంగ్లీష్ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

సోంపేట: ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనుల విషయంలో నాణ్యత ఎంతో ముఖ్యమని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీబీ చిట్టిబాబు అన్నారు. ఉపాధిహామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటకాలువల్లో పూడిక తీత పనులు సత్వరమే పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో ఏపీడీ రెడ్డి, కోర్స్ డైరెక్టర్ వైవీ రమణ, అమ్మినాడు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ఇచ్ఛాపురం: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శుభర్ బెహరా అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాద్ అధ్యక్షతన గ్రామ సంఘాల వీవోఏలతో సీబీఆర్ఎం (కమ్యూనిటీ బెస్ట్ రికవరీ మెకానిజం) యూబీఐ బ్యాంకు స్థాయి సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఎస్.ప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ మెరిన్‌మై, సీసీలు లక్ష్మి, మోహన్‌రావు, వీవోఏలు పాల్గొన్నారు.

బంకిం చంద్ర చటర్జీ జయంతి

సరుబుజ్జిలి: జాతీయ గీతం వందేమాతరం గేయాన్ని రచించిన బంకిం చంద్ర చటర్జీ జయంతి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, అధ్యాపక బృందంతో కలిసి చటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ సాహు, అధ్యాపకులు శ్రీనివాసరావు, వినోద్‌రాజు, కమలాకరరావు పాల్గొన్నారు.

పని భారాన్ని తగ్గించాలి


అశోక్‌కు పుష్ప గుచ్చం అందిస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారిపై పని భారం తగ్గించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాల నిర్వహణతో పాటు నాడు-నేడు పనులు, యాప్‌ల ఒత్తిడితో విద్యార్థుల చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

కంచిలి: సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ జేడీ వి.జయరాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు వర్షాకాలంలో పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో వి.నీరజ, పశు వైద్యాధికారి టి.శిరీష, ఈవోపీఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం కంచిలిలో పారిశుధ్య పనులు పర్యవేక్షించారు.

● **బూర్జ:** సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు వహించాలని ఎంపీడీవో రవీంద్రబాబు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో బూర్జ, గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందరంగా ఎంపిడివో మాట్లాడుతూ డయేరియా నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యులు జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య బాధ్యత ఈవోపీఆర్డీలదే

సరుబుజ్జిలి: గ్రామాల్లో పారిశుధ్య లోపించినా, ఎటువంటి సమస్యలు ఉన్నా ఈవోపీఆర్డీలే బాధ్యత వహించాలని డీఎల్‌పీవో గోపిబాల స్పష్టం చేశారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం కొత్తకోట, ఒప్పదాం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. రానున్న వర్షాలు సీజన్‌లో పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగునీరు, చెత్తకుప్పలు నిల్వా చేరకుండా తొలగించే ఏర్పాట్లు తక్షణమే చేయాలన్నారు. పరిశీలనలో ఈవోపీఆర్డీ ఆనందబాబు, కొత్తకోట పంచాయతీ సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.